సాక్షి తిరుపతి

ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025



పదికి పది రావాల్సిందే!
కార్పొరేట్‌కు దీటుగా ఈ సారి బీసీ హాస్టల్స్, గురుకులాల్లో పదో తరగతి ఫలితాలు వంద శాతం రావాలని మంత్రి ఆదేశించారు. - 8లో



'మేట్లు'ండారు!
ఉపాధి పథకాన్ని తన కార్యకర్తలు, అనుచరులకు దోచిపెట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. - 8లో



అమ్మో..చిరుత!
తిరుపతిలోని వేదిక్ వర్సిటీ ప్రాంగణంలో మళ్లీ చిరుత ప్రత్యక్షమైంది. శుక్రవారం అర్ధరాత్రి కలియతిరుగుతూ కనిపించింది. - 8లో

న్యూస్‌రీల్

నేటితో బేసిక్ శిక్షణ ఆఖరు



జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న శిక్షణార్థులు

తిరుపతి రూరల్: తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తిరుపతి జిల్లా వారి ఆధ్వర్యంలో జరుగుతున్న స్కౌట్స్ మాస్టర్ బేసిక్ శిక్షణ ఆదివారం ముగియనుంది. జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్. కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా 50 మంది ఉపాధ్యాయులు, పీఈటీలు శిక్షణ తీసుకుంటున్నట్లు జిల్లా కార్యదర్శి ఎం.జయరామ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉప విద్యాశాఖ ,అధికారి బాలాజీ శనివారం పర్యవేక్షించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నుంచి ఎంఎం.రెడ్డి, ఎం.కుప్పిరెడ్డి, జీ.వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, ట్రైనర్లు బాలిప్రసాద్, విజయ్‌కుమార్, హేమకుమార్, మురళి పాల్గొన్నారు.

నేడు స్థానికులకు శ్రీవారి దర్శన టోకెన్లు

తిరుమల: శ్రీవారి దర్శనం కోసం ఆదివారం తిరుపతిలోని మహతి ఆడిటోరియం, తిరుమలలోని బాలాజీ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో స్థానికులకు దర్శన టోకెన్లు జారీ చేయనున్నారు. ఫిబ్రవరి 4న రథసప్తమిని దృష్టిలో ఉంచుకుని టీటీడీ స్థానికుల దర్శనాన్ని రెండో మంగళవారానికి మార్చింది.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 21 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 62,971 మంది స్వామిని దర్శించుకున్నారు. 24,439 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.99 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 10 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లున్న వారు 3 గంటల్లో దర్శనం చేసుకుంటున్నారు.

"తిరుపతికి చెందిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి కుమారుడు ఎంటెక్ కోసం ఏడాది క్రితం అమెరికా టెక్సస్ క్రిస్టియన్ యూనివర్సిటీలో అడ్మిషన్ పొందాడు. ఈ ఏడాదితో కోర్సు పూర్తవుతుంది. ఇప్పటివరకు ఏడాది పాటు వర్సిటీలో పీజీ చేస్తూ ప్రైవేటు సంస్థలో పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నాడు. కళాశాల ఫీజులు, ఖర్చులకు సంపాదించుకునేవాడు. ఆర్థికంగా కాస్త భరోసా కలిగింది. ప్రస్తుతం అమెరికాలో నెలకొన్న ఆంక్షల నేపథ్యంలో కంపెనీ యాజమాన్యం పార్ట్‌టైమ్ ఉద్యోగులను తొలగించింది. దీంతో ఆ విద్యార్థి చదువుకే పరిమితం కావాల్సి వచ్చింది. గత రెండు నెలల నుంచి నెలకు రూ.85 వేలు తల్లిదండ్రుల నుంచి తెప్పించుకునేపరిస్థితి ఏర్పడింది.

.. ఇది ఒక్క కేంద్రప్రభుత్వ ఉద్యోగి కుమారుడి పరిస్థితే కాదు. అమెరికాపై మోజుతో వెళ్లిన జిల్లాకు చెందిన ప్రతి విద్యార్థి పరిస్థితీ ఇంతే. ప్రస్తుతం తిరుపతి జిల్లా నుంచి వెళ్లిన చాలామంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.



కలలకు కళ్లెం!

ట్రంప్ ఆంక్షలతో విద్యార్థుల బిక్కుబిక్కు

- వీసా కాలవ్యవధి ప్రామాణికంగా ఇంటికి పంపేస్తున్న పెద్దన్న
- పార్ట్‌టైమ్ జాబ్ చేసేందుకు జంకుతున్న విద్యార్థులు
- భయాందోళనలో తల్లిదండ్రులు

తిరుపతి సిటీ: 'మా వాడు అమెరికాలో ఎమ్ఎస్ చేస్తున్నాడు. మా అమ్మాయి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది..' అంటే నిన్నమొన్నటి వరకు గొప్పగా భావించేవారు. అలాంటిది అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రాగానే కథ అడ్డం తిరిగింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆశలన్నీ అడియాశలయ్యాయి. ప్రధానంగా వలస వచ్చిన వారిని అమెరికా నుంచి పంపేస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రుల్లో వణుకు మొదలైంది. అమెరికాలో చదువుకుంటూ పార్ట్‌టైమ్ పనిచేసుకుంటున్న విద్యార్థులు, ఉద్యోగ వేటలో ఉన్న వారు ఏ పనీ చేయకుండా ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

అమెరికాలో 9వేల మంది విద్యార్థులు!

అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని 38 ప్రముఖ యూనివర్సిటీలలో జిల్లాకు చెందిన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో 9వేల మందికి పైగా విద్యార్థులు ఫీజులు, నిత్యావసర ఖర్చుల కోసం స్థానిక కంపెనీలలో, హోటళ్లలో, తెలుగువారి సంస్థల్లో పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసుకుంటున్నారు. మిగిలిన 2 వేల మందికి పైగా విద్యార్థులు ఈ ఏడాది కొత్తగా కోర్సులు పూర్తిచేసుకుని ఉద్యోగం వేటలో నిమగ్నమయ్యారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో అమలులో ఉన్న ఆంక్షలు వీరిపై తీవ్రప్రభావం చూపుతున్నాయి. దీంతో జిల్లా నుంచి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన విద్యార్థులు, ఉద్యోగాన్వేషణలో ఉన్న యువత తల్లిదండ్రులు, బంధుమిత్రులలో ఆందోళన నెలకొంది.

అమెరికాలో విద్యనభ్యసిస్తున్న జిల్లా విద్యార్థులు

డల్లాస్	3,469
న్యూయార్క్	1,578
లాస్‌ఏంజెల్స్	2,501
ఫినిక్స్	320
ఫిలడెల్ఫియా	102
శాన్‌ఆంటోనియా	110
హూస్టన్	895
శాన్‌డియాగో	57
ఇతర ప్రాంతాల్లో	230
మొత్తం	9,262

తల్లిదండ్రులపై పెనుభారం

ఎఫ్–1 వీసాతో అమెరికాలో చదువుకుంటున్న విద్యార్థులతో పాటు వీసా అనుమతులు లేకుండా నివసిస్తున్న వలసదారులకు ట్రంప్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఇన్నాళ్లు తమ చదువుతో పాటు ఒక పూట పనిచేసి ఫీజు, ఖర్చులకు పోనూ మిగిలిన డాలర్లను ఇంటికి పంపించిన విద్యార్థులు ఇప్పుడు ఇండియాలోని తల్లిదండ్రులపై ఆధార పడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఒక్కో విద్యార్థికి ప్రతి నెలా రూ.70వేల నుంచి రూ.లక్ష వరకు తల్లిదండ్రులు పంపాల్సి వస్తోంది.

భయపడుతున్నారు



2022 నుంచి డల్లాస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాను. గ్రీన్ కార్డుతో డల్లాస్‌లో స్థిరపడ్డాను. ట్రంప్ వీసా ఆంక్షలతో కంపెనీలు పార్ట్‌టైమ్ ఉద్యోగాలకు ఫుల్‌స్టాప్ పెట్టేశాయి. ఇప్పటి వరకు ట్రంప్ ప్రభుత్వం కేవలం వీసా లేని వలసదారులపైనే చర్యలు తీసుకుంటోంది. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో వేల మంది తిరుపతి జిల్లా విద్యార్థులు చదువుతూ పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. – ప్రసాద్‌రెడ్డి మడితోట, తిరుపతి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, యూఎస్ఏ

అమెరికా ప్రయాణాన్ని విరమించుకున్నాం



నేను కేంద్ర సర్వీసులో పనిచేస్తున్నా. మా బాబు రవికిషోర్ చెన్నై ఐఐటీలో బీటెక్ మెకానికల్ పూర్తిచేసి రెండేళ్ల క్రితం ఎంటెక్ చదివేందుకు అమెరికాలోని లాస్‌ఏంజెల్‌లోని లయోలా మ్యారీమౌంట్ యూనివర్సిటీలో అడ్మిషన్ పొందాడు. ఎంటెక్ చేస్తూ రెండేళ్లుగా పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం కోర్సు పూర్తయింది. గత నెలలో ట్రంప్ ఎఫెక్ట్‌తో పార్ట్‌టైమ్ ఉద్యోగం మానేశాడు. ఇంకా మూడేళ్ల పాటు వీసా కాలవ్యవధి ఉంది. పూర్తి స్థాయి ఉద్యోగంలో చేరేందుకు ప్రయత్నిస్తున్నాడు. మాకు విజిటింగ్ వీసా పంపాడు. కానీ ప్రస్తుత పరిస్థితుల కారణంగా ప్రయాణాన్ని విమరించుకున్నాం. మా పాపను వచ్చే ఏడాది అమెరికాలో ఎమ్ఎస్ చేర్పించాలనుకున్నాం. కానీ ఈ పరిస్థితిలో ఆ ప్రక్రియను కూడా విరమించుకున్నాం.
– శ్రీనివాసులు, తిరుపతి, లాస్‌ఏంజెల్స్‌లో చదువుతున్న విద్యార్థి తండ్రి , తిరుపతి

పార్ట్‌టైమ్ ఉద్యోగం మానేశా



రెండేళ్ల క్రితం ఎమ్ఎస్ చేయడానికి అమెరికా వచ్చా. ఇన్నాళ్లు చదువుతూ ఒక పూట పార్ట్‌టైమ్ జాబ్ చేస్తూ ఫీజులతో పాటు ఇంటి అద్దె, ఇతర ఖర్చులు జరిగిపోయేవి. ట్రంప్ ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ఆంక్షలు విధించారు. దీంతో పని మానేశాను. ప్రస్తుతం ఉద్యోగ వేటలో ఉన్నా. నాకు ఇంకా మూడేళ్ల వరకు వీసా టైమ్ ఉంది. ప్రస్తుతానికి ఇబ్బంది లేదు. వీసా లేనివారిని పట్టుకుంటున్నారు. -కే.వికాస్, తిరుపతి, కాలిఫోర్నియాలో ఉంటున్న ఎమ్ఎస్ విద్యార్థి

ఇంటి నుంచి డబ్బులు తెప్పించుకుంటున్నా



బీటెక్ పూర్తి చేసిన తర్వాత న్యూయార్క్‌లో ఎమ్ఎస్ చేసేందుకు ప్రముఖ వర్సిటీలో 2023లో అడ్మిషన్ పొందాను. అదే ఏడాదిలో ఇక్కడ ఉన్న హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కంపెనీలో పార్ట్‌టైమ్ ఉద్యోగంలో చేరా. కానీ గత రెండు నెలల నుంచి ఆంధ్ర రాష్ట్రానికి చెందిన చాలా మంది విద్యార్థులు పార్ట్‌టైమ్ ఉద్యోగాలను మానివేశారు. నేను కూడా ఉద్యోగం మానేసి చదువుపైనే దృష్టి పెట్టాను. ప్రతి నెలా ఇంటి నుంచి రూ.65వేలు తెప్పించుకుంటున్నాను. పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసేటప్పుడు నా ఖర్చులు పోను ఇంటికి ప్రతి నెలా రూ.60వేలు పంపేదాన్ని. – ప్రణతి కోనెగుంట్ల, తిరుపతి, ఎమ్ఎస్ విద్యార్థిని, న్యూయార్క్

వీసా కాలపరిమితి ఉంటే చాలు



అమెరికాలో వీసా కాలవ్యవధి పూర్తయిన వలసదారులపైనే చర్యలు చేపడుతున్నారు. విజిట్ వీసాతో ఉద్యోగాలు చేస్తున్న వారిపైనే ట్రంప్ ఆంక్షలు విధించారు. వీసా కాలపరిమితి ఉంటే ఎటువంటి సమస్యలు ఉండవు. విద్యార్థులు బయపడాల్సిన పనిలేదు. నేను ఆస్టన్ సిటీలో ఎమ్ఎస్ చేస్తూ పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసుకుంటున్నాను. ఇక్కడ అలాంటి పరిస్థితి కనబడ లేదు. – ప్రేమ్ స్వరూప్, తిరుపతి, ఎమ్ఎస్ విద్యార్థి, హూస్టన్, అమెరికా

చిత్తూరు జిల్లా కేంద్రంలోని కట్టమంచి మున్సిపల్ పాఠశాలలో విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన కీచక ఉపాధ్యాయుడు ధనశేఖర్(సోషల్)పై కేసు నమోదు చేశారు. ఆ పాఠశాల విద్యార్థినుల ఫిర్యాదు మేరకు విద్యాశాఖాధికారులు విచారణ నిర్వహించారు. సంబంధిత టీచర్‌ను సస్పెండ్ చేస్తూ డీఈఓ వరలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.

తిరుపతి జిల్లా నారాయణవనం మండలం ఎరికంబట్టు ఎస్సీ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలో ఈ నెల 6 వ తేదీన కీచక టీచర్ బాగోతం బయటపడింది. ఆ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వెంకటరమణ మధ్యాహ్నభోజన సమయంలో నలుగురు బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. సాయంత్రం ఇంటికి వెళ్లిన చిన్నారులు తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం బయటపడింది. దీంతో ఆ ఉపాధ్యాయునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కీచక మాస్టార్లు

అమ్మ జన్మనిస్తుంది..నాన్న జీవితాన్నిస్తారు.. ఆ ఇద్దరి ప్రేరణతో జీవితం ప్రారంభించిన చిన్నారిని అత్యున్నత శిఖరాలకు చేర్చేందుకు అంతులేని ప్రోత్సాహమిచ్చి, ఉన్నతంగా రాణించేందుకు ఊపిరిలూదే అద్భుత శిక్షకుడే గురువు. అందుకే గురువుకు తల్లి, తండ్రి తరువాతి స్థానం ఇచ్చారు. అంతటి ప్రాధాన్యం ఉన్న ఉపాధ్యాయుడే కీచకుడిగా మారితే.. మరి చిన్నారుల పరిస్థితి ఏమిటి? వారు తమకు జరిగిన అన్యాయం గురించి ఎవరికి చెప్పుకోవాలో? ఎలా చెప్పుకోవాలో తెలియక కుమిలిపోతున్నారు. పూజ్యనీయులైన కొందరు గురువులే ఇటీవల గాడి తప్పుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ కీచకులుగా మారుతున్న ఘటనలతో సమాజమే తలదించుకోవాల్సి వస్తోంది.

- మంచి మార్గంలో నడిపించాల్సిన టీచర్లే వక్రమార్గంలో
- బాలికలతో అసభ్య ప్రవర్తన, వెకిలి చేష్టలు
- విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ లేమితో దారుణాలు
- విద్యాశాఖ కీర్తి ప్రతిష్టలు దెబ్బతీసేలా ఘటనలు
- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వరుస ఘటనలు



చిత్తూరు కలెక్టరేట్ : ఒక విద్యార్థి తన జీవితంలో ఇంట్లో కన్నా ఎక్కువ సమయం ఉపాధ్యాయుల వద్దే ఉంటారు. తల్లిదండ్రులు చెప్పిన దానికన్నా టీచర్లు చెప్పిన విషయాన్నే ఎక్కువ నమ్ముతారు. అలాంటి సముచిత స్థానం గురువులకు ఉంది. అయితే విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన కొంత మంది ఉపాధ్యాయులు సభ్యత మరిచిపోతున్నారు. అక్షరాలు నేర్పాల్సిన చేతితో బ్యాడ్ టచ్ చేస్తూ వికృతానందం పొందుతున్నారు. గురువుల ప్రవర్తనతో బాలికలు విసుగు చెందుతూ ఇబ్బందులకు లోనవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని కొందరు టీచర్లు కీచకులుగా మారుతున్నారు. చట్టాలు ఎంత పదునుగా తయారవుతున్నా వేధింపులు మాత్రం ఆగడం లేదు. అయితే వారి దుశ్చర్యలపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక చాలామంది బాధితులు లోలోపలే కుమిలిపోతున్నారు.

వెలుగులోకి రాని సంఘటనలెన్నో..

బ్యాడ్ టచ్ బారిన పడుతున్న పిల్లలు తమ బాధను ఎవరికీ చెప్పుకోలేకపోతున్నారు. తల్లిదండ్రులకు సైతం చెప్పే స్వేచ్ఛ కొన్ని కుటుంబాల్లో లేకపోవడంతో మానసికంగా కుంగిపోతున్నారు. చిత్తూరు జిల్లాలో 2,436, తిరుపతి జిల్లాలో 2,444 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. చిత్తూరు జిల్లాలో 1,41,217, తిరుపతి జిల్లాలో 1,87,444 మంది విద్యార్థులు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారు.

పోక్సో చట్టం ఏం చెబుతోంది..

ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ (పోక్సో). ఇది లైంగిక వేధింపుల నుంచి పిల్లలకు రక్షణ కల్పించే చట్టం. లైంగికదాడులు, నేరాలకు పాల్పడిన నిందితులకు ఈ చట్టంతో జీవితఖైదు, లేదా 7 నుంచి 10 ఏళ్ల వరకు జైలుశిక్ష విధిస్తారు. 16 ఏళ్ల లోపు బాలికలపై అత్యాచారం జరిగితే కనీసం 10 నుంచి 20 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది.

తిరుపతి జిల్లా సమాచారం

బాలురు	95,755
బాలికలు	91,689
మహిళా టీచర్లు	5,910
పురుష టీచర్లు	6,987
మొత్తం టీచర్లు	12,897

చూసీచూడనట్టుగా అధికారులు

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులపై పలు లైంగిక వేధింపుల ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లపై విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇలాంటి ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. రెండు జిల్లాల్లో ప్రతి మండలానికి ఎంఈఓలు, డీవైఈఓలు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులపై లైంగిక వేధింపులు, అసభ్య ప్రవర్తనలు పెరిగిపోతున్నా స్థానిక విద్యాశాఖాధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. తరగతి గదుల్లో విద్యార్థులకు నాణ్యమైన పాఠాలు బోధించి వారిని సుశిక్షితులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుల్లో కొందరు వికృత చేష్టలకు పాల్పడుతున్నప్పటికీ విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. సంఘటనలు జరిగిన సమయంలో డిప్యూటేషన్ల పేరుతో సదరు టీచర్లను పాఠశాలలను మార్చుతున్నారే తప్ప... అలాంటివి పునరావృత్తం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవడంలో చిత్తూరు, తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారులు విఫలమవుతున్నారు.

తిరుపతి జిల్లా సమాచారం

పాఠశాల కేటగిరీ	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	1934	94,178
ప్రాథమికోన్నత	188	57,801
ఉన్నత	322	35,465
మొత్తం	2,444	1,87,444

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పలు ఘటనలిలా..

- ఈ నెల 6వ తేదీన తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలంలోని ఎగువ సాంబయ్యపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు కృష్ణయ్య ఆ పాఠశాలలోని 4,7 తరగతుల విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తించారు. విచారణ నిర్వహించిన టీచర్లు ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు.
- 2022 వ సంవత్సరం ఏప్రిల్ 30వ తేదీన చిత్తూరు జిల్లా బంగారుపాళెం మండలం చిల్లగుండ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో అబు అనే ఉపాధ్యాయుడి లైంగిక వేధింపుల ఘటన దుమారం లేపింది. తాళికట్టేస్తానని, దువ్వెనలతో విద్యార్థుల తలలు దువ్వి, పౌడర్ రాసి, బొట్టు బిళ్లలు పెట్టేవాడని విద్యార్థినులు ఏకంగా అప్పట్లో కలెక్టర్‌కే ఫిర్యాదులు చేశారు.
- ఈ ఏడాది జనవరిలో తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం ఉడతావారిపాళెం ప్రాథమికోన్నత పాఠశాల బాలికలతో అదే పాఠశాల ఎస్జీటీ జాన్‌వెస్లీ అసభ్యంగా ప్రవర్తించి సస్పెండ్ అయ్యారు.

బిడ్డల్లా భావించాలి



ఉపాధ్యాయులను విద్యార్థులు తమ తల్లిదండ్రులుగా భావిస్తారు. అలాగే ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను తమ బిడ్డలుగా భావించాలి. అంతే తప్ప విద్యార్థులతో అసభ్యకరంగా వ్యవహరించడం సిగ్గుచేటు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైనది. కొందరు ఉపాధ్యాయులతో చెడ్డ పేరు వస్తుంది. విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠినమైన చర్యలు తప్పవు. – కేవీఎన్ కుమార్, డీఈఓ, తిరుపతి

నిత్యం పర్యవేక్షణ ఉండాలి



పాఠశాలల్లో టీచర్ల విధి విధానాలపై నిత్యం పర్యవేక్షణ ఉండాలి. విద్యార్థినులకు ఎలాంటి సమస్య ఎదురైనా ధైర్యంగా హెడ్‌మాస్టర్లకు చెప్పగలిగే వెసులుబాటును కల్పించాలి. విద్యార్థినులు ఏదైనా ఫిర్యాదు చేస్తే వెంటనే ఆ సమస్యలను పరిష్కరించి వారికి ధైర్యం చెప్పాలి. ప్రాథమిక పాఠశాల దశ నుంచే పిల్లలకు గుడ్‌టచ్...బ్యాడ్‌టచ్ ను నేర్పించాలి. – హేమారెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం, కార్వేటినగరం

చర్యలు కఠినంగా ఉంటాయ్



పాఠశాలల్లో చదివే విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు కఠినంగా ఉంటాయ్. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఎక్కడైనా సమస్యలున్నట్లైతే విద్యార్థినులు ధైర్యంగా ముందుకు వచ్చి హెచ్‌ఎం, మహిళా టీచర్లకు ఫిర్యాదు చేయాలి. బాలికల పట్ల అసభ్యకరంగా ఎవరైనా ప్రవర్తిస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదు. – శామ్యూల్, వైఎస్సార్ జిల్లా ఆర్జేడీ, పాఠశాల విద్య

ఉపేక్షించేది లేదు



బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. కఠినంగా చర్యలుంటాయ్. స్కూళ్లలో బాలికల కు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. నిత్యం వారి సమస్యలను మహిళా టీచర్లు ప్రత్యేకంగా తెలుసుకుంటున్నారు. ఎంఈఓలు, డీవైఈఓలు నిత్యం తనిఖీ లు చేసి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. – వరలక్ష్మి, డీఈఓ, చిత్తూరు

తిరుమలలో అదనపు ఈఓ తనిఖీలు



బూందీ పోటును తనిఖీ చేస్తున్న అదనపు ఈఓ

తిరుమల: తిరుమలలో అదనపు ఈఓ సీహెచ్. వెంకయ్యచౌదరి శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా లడ్డూ కౌంటర్లు, అగర్బత్తీల స్టాల్స్‌ను సందర్శించి విక్రయాలను పరిశీలించారు. బూందీ పోటును పరిశీలించి పలు సూచనలు చేశారు. శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత పెంచుతాం

తిరుపతి సిటీ: ఎస్వీయూలోని ఏ మెస్‌లో ఓ విద్యార్థి ప్లేట్‌లో జెర్రి ప్రత్యక్షమైన విషయంపై అధికారులు స్పందించారు. శనివారం హాస్టల్ వార్డన్‌లు, అధికారులు మెస్‌ను పరిశీలించారు. జరిగిన ఘటనపై విద్యార్థులను, సిబ్బందిని ఆరా తీశారు. ఇలాంటివి పునావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని, నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందిస్తామని చెప్పారు. అనంతరం విద్యార్థులు హాస్టల్స్‌లో వాష్‌రూమ్‌ల పరిస్థితి దారుణంగా ఉందని, బాత్‌రూమ్‌లకు తలుపులు శిథిలావస్థకు చేరుకున్నాయని వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులకు విన్నవించారు. రెండు రోజుల్లోపు అన్ని సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

పుస్తకం ఒక మంచి నేస్తం



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: పుస్తకం ఒక మంచి స్నేహితుడు వంటిదని, ప్రతి ఒక్కరూ రోజూ కొంత సమయం పుస్తక పఠనానికి కేటాయించాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. ఇస్కాన్ రోడ్డులోని క్రీడా మైదానంలో భారతీయ విద్యాభవన్ ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను కలెక్టర్ దంపతులతో కలిసి శనివారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 17వ పుస్తక ప్రదర్శన ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. అనంతరం పుస్తక ప్రదర్శనలోని స్టాల్స్‌ను తిలకించి పలు పుస్తకాలను కొనుగోలు చేశారు. భారతీయ విద్యాభవన్ సంచాలకుడు ఎస్.సత్యనారాయణరాజు, పలువురు సాహిత్య పుస్తక అభిమానులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జేసీబీ, టిప్పర్ల సీజ్

సాక్షి ఎఫెక్ట్..



జేసీబీతో పాటు టిప్పర్లను సీజ్ చేసిన సిబ్బంది

చంద్రగిరి: ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు కొరడా ఝుళిపించారు. శనివారం 'ప్చ్..వది లేశారు!' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పోలీసులు శనివారం ఉదయం మెరుపు దాడులు చేసి జేసీబీతో పాటు టిప్పర్లను సీజ్ చేశారు. శనివారం ఉదయం స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతాల్లో జేసీబీల ద్వారా అక్రమంగా ఇసుకను తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు మెరుపు దాడులు చేపట్టారు. చంద్రగిరి బ్రహ్మంగారి ఆలయం వద్ద, స్వర్ణముఖి బ్రిడ్జి వద్ద, కేశవరెడ్డి పాఠశాల వెనుక భాగంలో పోలీసులు దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో రెండు జేసీబీలు, మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆటో డ్రైవర్ హత్య కేసులో ఒకరి అరెస్ట్

సత్యవేడు: సత్యవేడు మండలం, ఓబులరాజు కండ్రిగకు చెందిన ఆటో డ్రైవర్ ఎస్.లక్ష్మయ్య(45) హత్య కేసులో నిందితుడు జగదీష్(39)ను అరెస్టు చేసినట్లు పుత్తూరు డీఎస్పీ రవికుమార్ తెలిపారు. వరదయ్యపాళెం మండలం, చిన్నపాండూరు నుంచి ఎరువులు తీసుకొని ఓబులరాజుకండ్రిగ గ్రామాని వెళ్లేందుకు జగదీష్ ఆటో డ్రైవర్ లక్ష్మయ్యను పిలిచి బాడుగ కుదుర్చుకున్నాడు. ఆపై మరో ఆటోలో మందుల సంచులు వేసుకొని వెళ్లాడు. దీనిపై తలెత్తిన వివాదం చివరకు లక్ష్మయ్యపై దాడికి దారితీసింది. ఈ క్రమంలో తిరుపతిలో చికిత్స పొందుతూ లక్ష్మయ్య మృతి చెందాడు. దీనికి సంబంధించి సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో ఫిబ్రవరి 3వ తేదీ తొలుత ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. లక్ష్మయ్య మృతి చెందడంతో ఆ కేసును హత్య కేసుగా మార్చారు. దీనిపై పుత్తూరు డీఎస్పీ రవికుమార్ సూచనల మేరకు సీఐ మురళి, ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టారు. శనివారం నిందితుడు జగదీష్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. త్వరలోనే మరో నిందితుడ్ని కూడా అదుపులోకి తీసుకుంటామన్నారు.

చెరువులో గూడ బాతు కళేబరం



మృతి చెందిన గూడ బాతుని చూపిస్తున్న అధికారి

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఉల్సా పడవ చెరువులో భారీ గూడబాతు(ఫెలికాన్) పక్షి కళేబరం శనివారం బయటపడింది. స్థానికులు గుర్తించి వన్యప్రాణి, అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. వెంటనే డీఎఫ్ఓ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. ఫెలికాన్ కళేబరాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. కళేబరాన్ని పోస్టు మార్టం నిర్వహించిన తర్వాత సమాచారం అందజేస్తామని డీఎఫ్ఓ హారిక తెలిపారు.

మేట్లుండారు!

ఉపాధి పథకాన్ని తమ కార్యకర్తలు, అనుచరులకు దోచిపెట్టేందుకు కూటమి నేతలు సిద్ధమయ్యారు. ఈ మేరకు గతంలో రద్దు చేసిన శ్రమశక్తి సంఘాలు, మేట్ల వ్యవస్థను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు గ్రామాల్లో ముమ్మరంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. తాము సూచించిన వారినే మేట్లుగా నియమించాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

మళ్లీ శ్రమశక్తి సంఘాలు, మేట్ల వ్యవస్థ

- మేట్లకు గౌరవ వేతనం
- ప్రజాధనం స్వాహాకు రంగం సిద్ధం
- గతంలో అక్రమాలకు చెక్ పెట్టిన వైఎస్సార్‌సీపీ

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం తమ కార్యకర్తలకు అందినకాడికి అడ్డంగా దోచిపెట్టేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగానే శ్రమశక్తి సంఘాలు, మేట్ల వ్యవస్థను తీసుకొచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఉపాధి హామీ పథకంలో 2014 నుంచి 2019 వరకు టీడీపీ నాయకులు , కార్యకర్తలు కాంపోనెంట్ పనుల్లో రూ.100కు రూ.15 నుంచి రూ.20 వరకు ఖర్చు చేసి రూ.30 నుంచి రూ.65 వరకు స్వాహా చేశారు. మళ్లీ నాటి పరిస్థితులే పునరావృతమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు తమ వారిని నియమంచుకున్నారు. మాట వినని ఏపీఓ, సాంకేతిక సహాయకులు, ఈసీలను పక్కన పెడుతున్నారు. అక్రమాలకు అలవాటైన శ్రమశక్తి సంఘాలు ఏర్పాటుతో పాటు మేట్ వ్యవస్థను తీసుకొచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

కూలీల కడుపుకొట్టి..

ప్రతి శ్రమశక్తి సంఘానికి లీడర్‌గా వ్యవహరించే వారిని మేట్‌గా పేర్కొంటారు. ఉపాధి పనులకు కులీలను తీసుకుపోవడమే వారి బాధ్యత. ఈయన కూడా ఇతర కూలీలతోపాటు పనిచేయాల్సిందే. కానీ పని చేయడం అంటూ జరగదు. కూలీల పైన అజమాయిషీ ఉంటుంది. అయితే కూలీలతో సమానంగా వేతనం లభిస్తుంది. శ్రమశక్తి సంఘానికి లీడరుగా వ్యవహరించేందుకు ప్రతి ఫలంగా ఉపాధి పనికి వచ్చిన ప్రతి కూలీ నుంచి రోజుకు రూ.1.5 కట్ చేసి చెల్లిస్తారు. మేట్‌కు 100 రోజులు పనిదినాలు పూర్తయితే ప్రతి కూలీ నుంచి రూ.8 కట్‌చేసి మేట్‌కు గౌరవవేతనంగా చెల్లిస్తారు.

పేట్రేగుతున్న అక్రమాలు

జిల్లాలో 30 శాతం వరకు బోగస్ కూలీలు హాజరవుతున్నారు. ఒక పనికి 60 మంది హాజరైతే అందులో 130 మంది వరకు వచ్చినట్లు మస్టర్ వేస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా ఏమీ చేయలేకపోతున్నారు. దొంగ మస్టర్లతో వచ్చే వేతనాలు ఫీల్డ్ అసిస్టెంట్లు, టీడీపీ నేతలు చెరిసగం పంచుకుతింటున్నారు. తాజాగా శ్రమశక్తి సంఘాలు ఏర్పాటుతో అక్రమాలు మరింత పెరిగిపోయే ప్రమాదం ఉంది.

మళ్లీ మేట్ల నియామకం

2018–19 వరకు జాతీయ గ్రామీణ ఉపాధి పథకం వ్యవహారాలను టాటా కన్సల్టెన్సీ సర్వీసు (టీసీఎస్) సాఫ్ట్‌వేర్‌లో నిర్వహించే వారు. ఇది పారదర్శకంగా లేకపోవడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేషనల్ ఇన్ఫర్మ్యాటిక్ సెంటర్ (ఎన్ఐసీ) సాఫ్ట్‌వేర్‌కు మార్చింది. దీంతో శ్రమశక్తి సంఘాలు, మేట్ల వ్యవస్థ రద్దయ్యింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పాత పద్ధతిని మళ్లీ పునరుద్ధరించేందుకు సర్వం సిద్ధం చేసింది. శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేయడం, వీటికి లీడర్ల ఎంపిక, కొత్త సంఘాలకు మేట్‌లను నియమించడం చురుగ్గా జరుగుతోంది. అన్నింటిల్లోనూ కూటమి కార్యకర్తలే ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటోంది.

అన్నిటా వారిదే హవా

తిరుపతి జిల్లాలో 2.61లక్షల జాబ్ కార్డులు ఉండగా.. అందులో 2.21 లక్షల కార్డులు యాక్టీవ్‌గా ఉన్నాయి. 40 నుంచి.. 50 మంది కూలీలతో ఒక శ్రమశక్తి సంఘం ఏర్పాటవుతోంది. ప్రతి సంఘానికి ఒక లీడర్ ఉంటారు. ఈ సంఘాల లీడర్లకు కూడా టీడీపీ కార్యకర్తలనే నియమిస్తున్నారు. ఈ ప్రక్రియ గ్రామీణ ప్రాంతాల్లో చురుగ్గా సాగుతోంది. లీడర్లనే మేట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే టీడీపీ కార్యకర్తలు, ఫీల్డ్ అసిసెంట్లుగా నియమితులై అక్రమాలకు పాల్పడుతున్నారు. ఒక గ్రామంలో ఐదారు శ్రమశక్తి సంఘాలు ఉండగా ప్రతి సంఘానికి ఒక మేట్ ఉంటారు. గ్రామ స్థాయిలోనే టీడీపీకి చెందిన వారు ఫీల్డ్ అసిస్టెంటు ఉండగా మరో ఐదారుగురు టీడీపీ కార్యకర్తలు మేట్లుగా రానున్నారు. శ్రమశక్తి సంఘాల ఏర్పాటు మేట్ల నియామక పక్రియలను ఈనెల చివరిలోపు పూర్తిచేసే విధంగా గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఫీల్డ్ అసిస్టెంట్, శ్రమశక్తి సంఘాల లీడర్ల ఆధ్వర్యంలోనే ఇక ఉపాధి పనులు జరగనున్నాయి.

గతంలో మింగేశారు



2014లో తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో పాత పనులకు మెరుగులు దిద్ది దొంగ మస్టర్లు వేసి నిధులు కొల్లగొట్టారు. పలు మండలాల్లో పాత పనులకే మెరుగు దిద్ది నిధులు మింగేశారు. ఒక పనికి రెండు మండలాల్లో బిల్లులు చేసుకోని నిధులు కాజేశారు. పాత చెక్‌డ్యామ్‌లకు మెరుగులు దిద్దుకుని బిల్లులు మేసేశారు. – శ్రీనివాసులురెడ్డి

మళ్లీ అక్రమాలే



కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు టీడీపీ కార్యకర్తలకు లబ్ధి చేకూర్చే విధంగా ఉంటున్నాయి. 2014 నుంచి 2018 వరకు ఉన్న మేట్ల వ్యవస్థతో అనేక అక్రమాలు జరిగాయి. మళ్లీ ఇలాంటి అక్రమాలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుండడం ఆందోళన కలిగించే విషయం. – కార్తీక్‌రెడ్డి

వలసలు పెరిగే ప్రమాదం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా ఉపాధి పనులు కల్పించింది. శ్రమశక్తి సంఘాలను మేట్ల వ్యవస్థను రద్దు చేసింది. కూటమి ప్రభుత్వం మాత్రం టీడీపీ కార్యకర్తల కోసమే మళ్లీ శ్రమశక్తి సంఘాలు, మేట్ల వ్యవస్థను తీసుకొచ్చింది. దీంతో మళ్లీ వలసలు పెరిగే ప్రమాదం ఏర్పడింది. – మన్నారపు రవికుమార్

తూకాల్లో తేడాలు..ప్రశ్నించిన వారిపై దూషణలు

రేణిగుంట (ఏర్పేడు) : ఏర్పేడు మండలం, పాగాలి చౌక దుకాణంలో నిత్యావసర సరుకుల తూకాల్లో తేడా వస్తున్నట్లు స్థానికులు శనివారం అధికారులకు ఫిర్యాదు చేశారు. 20 కిలోల బియ్యానికి 2 కిలోలు తక్కువగా వేస్తున్నారని కార్డుదారులు గుర్తించారు. తూకాల్లో తేడా ఉండడంతో పాటు ఓ బుట్టను పెట్టి అందులోనే బియ్యం పోసి కార్డుదారులకు వేస్తున్నట్లు ఆరోపించారు. దీనిపై చౌక దుకాణం డీలరు తులసమ్మను ప్రశ్నించగా ఆమె కుటుంబీకులు 'ఇది మా ప్రభుత్వం... వేసింది తీసుకోండి.. దిక్కున్న చోటుకు వెళ్లి చెప్పుకోండని' పరుష పదజాలంతో దూషిస్తున్నారని వాపోయారు. ఈ మేరకు కొందరు యువకులు శనివారం జిల్లా విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఏర్పేడు తహసీల్దార్ భార్గవిని వివరణ కోరగా.. విషయం తెలిసిందని, వీఆర్‌ఓను పంపి బుట్ట తీసి బియ్యం వేయాలని హెచ్చరించామన్నారు.



పాగాలి చౌక దుకాణంలో బుట్టపెట్టి తూకం వేస్తున్న డీలరు

అమ్మో..చిరుత!

తిరుపతి సిటీ: వేదిక్ వర్సిటీ ప్రాంగణంలో మళ్లీ చిరుత ప్రత్యక్షమైంది. గత రెండు నెలలుగా వేదిక్, ఎస్వీయూ ప్రాంగణంలో చిరుత సంచరిస్తూ జింకలను, శునకాలను వేటాడుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి 1.40 గంటల ప్రాంతంలో వేదిక్ వర్సిటీ అకడమిక్ భవనం ఎదుట ఉన్న పొదల్లో చిరుత సంచరించిన దృశ్యాలు వర్సిటీ సిబ్బంది కంటపడ్డాయి. అటవీశాఖ అధికారులు వర్సిటీలలో విద్యార్థులను అప్రమత్తం చేస్తూ సూచిక బోర్డులు, సీసీ కెమెరాలు అమర్చి చేయిదులుపుకున్నారు. రెండు రోజుల క్రితం పెరంబూలేషన్ పేరుతో చిరుత కబ్స్ కోసం ఫోర్‌లేయర్ ఆపరేషన్ చేసినా చిరుత జాడ కనిపించలేదు. ప్రాణ నష్టం జరగకముందే చిరుతను బంధించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని విద్యార్థులు, ఉద్యోగులు కోరుతున్నారు.

పదికి పది రావాల్సిందే!

- జిల్లా అధికారులతో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

తిరుపతి సిటీ: కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా రాబోయే పదో తరగతి పరీక్షల్లో బీసీ హాస్టళ్లలో వంద శాతం మేర ఫలితాలు రావాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత అధికారులను ఆదేశించారు. ఇందుకోసం విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందజేయాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. శనివారం తిరుపతిలో పద్మావతి గెస్ట్ హౌస్‌లో జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. మరో నెల రోజుల్లో జరగనున్న పదో తరగతి పరీక్షల నేపథ్యంలో బీసీ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల విద్యార్థుల ప్రిపరేషన్‌పై అధికారులను ఆరా తీశారు. హాస్టళ్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులను ఒత్తిడికి గురిచేయకుండా, పరీక్షలకు సిద్ధం చేయాలని చెప్పారు.

అలసత్వం వద్దు

బీసీ హాస్టళ్ల అభివృద్ధికి ప్రభుత్వం అందజేసే నిధులతో పాటు సీఎస్ఆర్ ఫండ్స్, ఎంపీ ల్యాడ్స్ నిధుల సేకరించాలని బీసీ సంక్షేమ శాఖాధికారులను మంత్రి ఆదేశించారు. సీఎస్ఆర్ ఫండ్స్ కోసం జిల్లా పరిధిలో పరిశ్రమల యాజమాన్యాలను సంప్రదించేందుకు కలెక్టర్‌తో చర్చించాలన్నారు. దాతలను సంప్రదించి, విరాళాలు సేకరించి హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని సూచించారు.

వంద శాతం గ్రౌండింగ్ జరగాలి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో రెండు నెలల్లో ముగియనుందని, ఆలోగా బీసీ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో అందజేస్తున్న స్వయం ఉపాధి పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసి, యూనిట్లు గ్రౌండింగయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. శనివారం తిరుపతిలో పద్మావతి గెస్ట్ హౌస్‌లో జిల్లా బీసీ కార్పొరేషన్, చేనేత, జౌళిశాఖాధికారులతో మంత్రి సవిత సమీక్ష సమావేశం నిర్వహించారు. బీసీలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి పాడి, గొర్రెలు, మేకల పెంపకం యూనిట్లు, మహిళలకు కుట్టుమిషన్లతో పాటు ఈవెంట్ మేనేజ్‌మెంట్ నిర్వహణపై ఆర్థిక సాయమందించనున్నట్లు తెలిపారు. జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు కూడా ఆర్థిక సాయమందిస్తామన్నారు. బీసీ స్వయం ఉపాధి యూనిట్ల దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, చేనేత జౌళిశాఖ ఏడీ పీ.వరప్రసాద్, ఆప్కో జిల్లా మార్కెటింగ్ అధికారి కోటేశ్వరరావు, ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు ఏడీ వెంకట్రావు, లేపాక్షి మేనేజర్ రవి పాల్గొన్నారు.

నోటిఫికేషన్‌లో సవరణ

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాల ఆధ్వర్యంలో పలు ఉద్యోగాల కోసం శుక్రవారం విడుదల చేసిన కంబైన్డ్ నోటిఫికేషన్‌లో ల్యాబ్ అటెండెంట్ పోస్ట్ అర్హతలో చిన్న మార్పులు చేసి వెబ్‌సైట్‌లో ఉంచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ విషయాన్ని పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

వీఐపీ బ్రేక్ దర్శనం కోటా పెంపు

తిరుమల : ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్టీస్) సభ్యులకు ప్రస్తుతం రోజువారీగా అందిస్తున్న వీఐపీ బ్రేక్ దర్శన కోటాను 50 నుంచి 100 మందికి పెంచుతూ శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈఓ ఎం.లోకనాథం శనివారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతోపాటు పై సొసైటీ నుంచి వచ్చే వృద్ధులైన తల్లిదండ్రులు, అత్తమామలకు శ్రీవారి దర్శన అవకాశం కల్పిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జూడాల సమ్మె ఉధృతం

- 6వ రోజుకు చేరిన నిరవధిక నిరసన



వైఎస్సార్ పరిపాలనా భవనాన్ని ముట్టడించిన జూడాలు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో జూడాలు సమ్మెను ఉధృతం చేశారు. ఆరో రోజు అయిన శనివారం వర్సిటీలోని వైఎస్సార్ పరిపాలనా భవనాన్ని మరోమారు ముట్టడించారు. కార్యాలయం ఎదుట బైఠాయించారు. అధికారులు, సిబ్బందిని లోనికి అనుమతించకుండా ప్రధాన ద్వారం మూసివేసి నిరసనకు దిగారు. స్టైఫండ్ పెంచాలంటూ నినదించారు. దీంతో పోలీసులు పెద్ద సంఖ్యలో వర్సిటీలోని వైఎస్సార్ పరిపాలనా భవనం వద్దకు చేరుకున్నారు.

పరామర్శ

జూడాలు చేస్తున్న సమ్మె ఆరో రోజుకు చేరింది. వర్సిటీలో సమ్మె చేస్తున్న పశువైద్య విద్యార్థులను స్థానిక కూటమి నేతలు పరామర్శించారు. అనంతరం విద్యార్థులు పెద్ద సంఖ్యలో స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను కలసి వినతిపత్రం సమర్పించారు.

వెనక్కితగ్గే ప్రసక్తే లేదు

బీవీఎస్సీ విద్యార్థులకు ప్రస్తుతం ఇస్తున్న గౌరవవేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామంటూ వస్తున్న వార్తలను ఆమోదించే ప్రసక్తేలేదని జూడాలు తేల్చిచెప్పారు. మిగిలిన అన్ని వైద్య విభాగపు విద్యార్థులకు ఇస్తున్న గౌరవవేతనానికి సమానంగా తమకు చెల్లించే వరకు సమ్మెను కొసాగిస్తామని చెప్పారు.

నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు!

- అధికార పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్!

సాక్షి టాస్క్‌ఫోర్సు: ప్రతి సోమవారం ప్రభుత్వ కార్యాలయాల్లో చేపట్టే గ్రీవెన్స్ కార్యక్రమాన్ని అధికార పార్టీ ప్రజాప్రతినిధి తన పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేశారు. గూడూరులోని టీడీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు తహసీల్దార్లు చంద్రశేఖర్, శ్రీనివాసులు, జేజేరావు, రామయ్య, గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అధికారులను తన చేతుల్లో ఉంచుకునేలా కార్యక్రమం నిర్వహించడంపై పలు విమర్శలు వ్యక్తమయ్యాయి. రెవెన్యూ కార్యాలయాల్లో తహసీల్దార్లు సమస్యలను పరిష్కరించకపోవడంతోనే ఇలా పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారా..? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.



గూడూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యేతో పాటు అధికారులు